## అమ్మపల్లికి పోటెత్తిన భక్తులు



అమ్మపల్లి ఆలయంలో భక్తుల రద్దీ

**శంషాబాద్ రూరల్:** కొత్త ఏడాది సందర్భంగా బుధవారం భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మండలంలోని నర్కూడ శివారులో ఉన్న అమ్మపల్లి (సీతారామచంద్ర స్వామి) ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరారు. ప్రత్యేక క్యూలైన్‌తో దర్శనం చేసుకునేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ముచ్చింతల్‌లోని దివ్యసాకేతాలయం, సమతామూర్తి కేంద్రానికి సైతం భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు.

## రహదారి విస్తరణకు నోటీసులు

**శంషాబాద్:** ధర్మగిరి రోడ్డు నుంచి కాపుగడ్డ, యాదవబస్తీల మీదుగా జాతీయ రహదిరి వరకు ఉన్న రోడ్డును విస్తరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మున్సిపల్ అధికారులు నోటీసుల జారీ చేస్తున్నారు. రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయే వారికి నాలుగైదు రోజులుగా నోటీసులను అందజేస్తున్నారు. విస్తరణలో భాగంగా మొత్తం 208 ఆస్తులను తొలగించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే వందమందికి పైగా నోటీసులను అందజేశారు. రహదారిని మొత్తం 80 ఫీట్ల విస్తరణను చేపట్టేందుకు రంగం సిద్ధమైంది.

## కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్

**బండ్లగూడ:** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీలోని విజయ గణపతి దేవాలయ నిర్వాహకులు రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించిన కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



**గోల్కొండ:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని సీపీఎం నాంపల్లి జోన్ కన్వీనర్ మల్లేష్ అన్నారు. అంబేడ్కర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బుధవారం లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను అవమానించే వాఖ్యలు అమిత్‌షా చేయడం బీజేపీకి దళితులపై ఉన్న అభిమానం ఏపాటిదో తెలిసిపోయిందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతిపౌరుడి తక్షణ కర్తవ్యం అన్నారు. సీపీఎం నాయకులు వెంకటస్వామి, సుధాకర్, రమేష్, జనార్దన్, నర్సమ్మ, స్వర్ణ, లక్ష్మమ్మ, కళ్యాణ్ పాల్గొన్నారు.

## బాధితులకు అండగా నిలబడాలి

**గోల్కొండ:** పీస్ అండ్ మైత్రి కమిటీల్లో పని చేసే వారికే ప్రాధాన్యం ఉంటుందని ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్ అన్నారు. బుధవారం అధ్యక్షుడు ఆబేద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు పోలీసులు, ప్రజల మధ్య వారధిగా ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో పైరవీలు చేయకుండా బాధితులకు అండగా నిలబడాలని సూచించారు. యువకులకు పీస్ అండ్ మైత్రి కమిటీల్లో సభ్యత్వం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. తహసీన్ పాషా, ఇలియాజ్ అలీ పాల్గొన్నారు.

## అయ్యప్పసొసైటీలో అగ్నిప్రమాదం

**మాదాపూర్:** ఇన్వర్టర్, బ్యాటరీలు కాలిపోయిన ఘటనలో భవనంలో మంటలు రేగాయి. మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీ వైఎస్ఆర్ కూడలిలో ఉన్న ఓ భవనంలోని ఐదో అంతస్తులో బుధవారం నిపున్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఐటీ కంపెనీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం సెలవురోజు కావడంతో ఎవరూ లేరు. తాళం వేసిఉన్న కార్యాలయం నుంచి సాయంత్రం 4 గంటల సమయంలో దట్టమైన పొగలు రావడంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇన్వర్టర్, బ్యాటరీలు కాలినందునే ప్రమాదం జరిగిందని మాదాపూర్ ఫైర్ ఆఫీసర్ మహ్మద్ ఫైజల్ తెలిపారు.



ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నేతలు



మణికొండలో కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో...



మంచిరేవుల శ్రీవేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

# వినూత్నంగా.. సరి'కొత్త'గా..

- కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం
- వాడవాడలా సందడి చేసిన యువత
- బాణసంచా పేలుళ్లతో హోరెత్తిన వీధులు
- ప్రత్యేక కార్యక్రమాలతో వీడ్కోలు.. స్వాగతం!



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో సంబరాల్లో నాయకులు

**బండ్లగూడ:** నూతన ఆంగ్ల సంవత్సరానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని యువత ఘనంగా స్వాగతం పలికింది. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి న్యూ ఇయర్ పార్టీలతో సరికొత్తగా వెల్‌కం చెప్పారు.

◆ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గిరిధారి మురారి గృహ సముదాయంలోని ఆంగ్ల నూతన సంవత్సరాన్ని వినూత్న రీతిలో స్వాగతించారు. వెళ్లిపోతున్న సంవత్సరంలో అక్కడి చిన్నారులు, పెద్దలు వేసిన చిత్రాలతో పాటు వస్తున్న సంవత్సరాన్ని స్వాగతిస్తూ వేసిన చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనను అక్కిరాజు నర్సింహారావు, సావిత్రమ్మ దంపతులు ప్రారంభించారు. సంప్రదాయ సంగీతబద్ధమైన గీతాలు ఆలపిస్తూ నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. లయశ్రీ, అనురాధ, అనివ్రత, శివలక్ష్మి, మురళీకృష్ణ, చిన్నారులు హరిహరన్, ఆద్య, అశ్వథ్ తమ అద్భుత గానంతో అందరినీ అలరించారు. గాయని లయశ్రీ మాట్లాడుతూ... ఈ విధంగా సంప్రదాయబద్ధంగా కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలకవచ్చని ఇక్కడే తెలిసిందన్నారు. దీనిని రూపొందించిన అక్కిరాజు శ్రీహరిని అభినందించారు. నిర్వాహకులు నర్సింహం, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

**కోటి ఆశలతో...**

**మణికొండ:** కొత్త సంవత్సరానికి కోటి ఆశలతో ప్రజలు స్వాగతం పలికారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లలో మంగళవారం రాత్రి కేకులు కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. బుధవారం ఉదయం తమ ఇష్ట దేవాలయాలకు వెళ్లి దర్శనాలు చేసుకుని తమను ఈ సంవత్సరం మొత్తంగా చల్లగా చూడాలని, తమ లక్ష్యాలను అధిగమించేలా చూడాలని వేడుకున్నారు. రాజకీయ నాయకులు తమ అధిష్ఠాన నాయకులను కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అవతార్‌లో ప్రజలు కొత్త సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి...**

**మైలార్‌దేవ్‌పల్లి:** నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి ఆకాంక్షించారు. రాజేంద్రనగర్ సీనియర్ నేత కొలన్ సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సబితా ఇంద్రారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ యువ నాయకుడు మన్నే శివకుమార్ జన్మదినం సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు డి.రమేష్‌ముదిరాజ్, జె.చిత్తారి, మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీగూడ జీసెస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో...**

**మైలార్‌దేవ్‌పల్లి:** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ జీసెస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు బైబిల్ సందేశాన్ని వినిపించారు. సీపీఎం నేతలు జాజాల రుద్రకుమార్ హాజరయ్యారు. ఈ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా సీపీఎం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యురాలు సువార్త తదితరులు పాల్గొన్నారు.



గిరిధారి గృహంలో పాటలు పాడుతున్న విద్యార్థిని



గిరిధారిలో ప్రదర్శనకు ఉంచిన చిత్రాలు



లక్ష్మీగూడలోని చర్చిలో సీపీఎం నేత యాదయ్య

# సీఎంకు ఎమ్మెల్యేల శుభాకాంక్షలు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు, నాయకులు

**మణికొండ:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ఆయన నివాసంలో బుధవారం సీఎంను ఎమ్మెల్యేలతోపాటు పలువురు నాయకులు కలిశారు. నూతన సంవత్సరం రాష్ట్రం అన్ని రంగాలలో అగ్రభాగంలో నిలవాలని ఈ సందర్భంగా సీఎం ఆకాంక్షించారు. ఎమ్మెల్యేలతో పాటు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీకి చైర్మన్‌గా నియమితులైన తలారి మల్లేష్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, నార్సింగి పీఏసీఎస్ చైర్మన్ టి. కృష్ణ, గుడిమల్కాపూర్ మార్కెట్ డైరెక్టర్ ఓంప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 కేసుల నమోదు



డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్

**రాజేంద్రనగర్:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఈ డ్రైవ్ కొనసాగింది. ట్రాఫిక్ అధికారులతో పాటు పోలీసు సిబ్బంది అంతా ప్రధాన రహదారులపై తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మొత్తం 22 కేసులను నమోదు చేశారు. ఆరాంఘర్ చౌరస్తా, కాటేదాన్ ప్రాంతాల్లో రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీతో పాటు ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్‌లు స్వయంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పాల్గొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి వివరాలను సేకరించి వారి వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మద్యం తాగి వాహనాలను నడపవద్దని సూచించారు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో తాము విస్తృతంగా ప్రచారం నిర్వహించామన్నారు. తాగి వాహనాలను నడపవద్దని.. రాష్ డ్రైవింగ్ శ్రేయస్కరం కాదని వాహనదారులకు వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 22 మంది మందుబాబులు పట్టుబడ్డారన్నారు. వారందరిపై కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.

# అన్ని వర్గాల అభ్యున్నతికి సీపీఎం కృషి



జెండా ఆవిష్కరణలో సీపీఎంజిల్లా కార్యదర్శి యాదయ్య తదితరులు

**రాజేంద్రనగర్:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతితోపాటు పేదల ప్రజలు, కార్మిక కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం అవిశ్రాంత పోరాటం చేస్తున్నదని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పేర్కొన్నారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆరాంఘర్ చౌరస్తాలో మండల కమిటీ సభ్యుడు కాలే రాజు అధ్యక్షతన సీపీఎం నూతన జెండాను యాదయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలనలో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని భూమి పెద్ద ఎత్తున కబ్జాకు గురైందన్నారు. బస్తీలు, కాలనీల్లో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల మధ్యలో ఉన్న స్థలాలు కూడా కబ్జాకు గురయ్యాయన్నారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్ర కుమార్, మండల కమిటీ సభ్యులు ఎస్.రామ్మోహన్, ఎన్.జంగయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే వారికే పదవులు



మార్కెట్ చైర్మన్ మల్లేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



బండారి శంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

**బండ్లగూడ:** కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి గుర్తింపుతో పాటు పదవులు దక్కుతాయని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. నూతనంగా గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన తలారి మల్లేష్ ముదిరాజ్‌ను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిమల్కాపూర్ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయాలన్నారు. అందరి సహాయ సహకారాలు తీసుకుంటూ ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నేతుల గోకరి సురేష్‌గౌడ్, రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సత్కారం...**

**రాజేంద్రనగర్:** గుడిమల్కాపూర్ వ్యవసాయ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన శివరాంపల్లి ప్రాంతానికి చెందిన యువ నాయకుడు బండారి శంకర్‌ను బుధవారం పలువురు కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శివరాంపల్లి యువసేన ప్రెసిడెంట్ రణధీర్ రెడ్డి ఆధ్వర్యంలో బండారి శంకర్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. నేతలు హరికిషన్ జీ, రవి గౌడ్, రఘు ముదిరాజ్, గణేష్ చారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గోల్కొండ పోలీసుల పనితీరు భేష్

**గోల్కొండ:** గోల్కొండ పోలీసుల పనితీరు అత్యుత్తమంగా ఉందని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఆయన వార్షిక తనిఖీల సందర్భంగా గోల్కొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్‌లోని వివిధ కౌంటర్ల సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రిసెప్షన్, జేడీ సెక్షన్, ఎస్హెచ్ఓల కౌంటర్లు తదితర వాటిని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఆయా కౌంటర్ల సిబ్బందితో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో ఏ విధంగా మాట్లాడుతారు.? ఎఫ్ఐఆర్ ఎప్పుడు నమోదు చేస్తారు? వంటి తదితర విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పోలీసులు అంటే ప్రజల్లో గతంలో లాగా భయం పోయిందని ప్రజలు పోలీసులు అంటే గౌరవ భావంతో చూస్తున్నారని అన్నారు. నేర నియంత్రణ, నేరాల అదుపు తదితర విషయాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీసులకు సహకరిస్తున్నారని అన్నారు. తెలంగాణ పోలీసుల పనితీరు దేశంలోనే అత్యుత్తమంగా ఉందని పోలీసులు అంటే నేరగాళ్ల వెన్నులో వణుకు పుడుతుందన్నారు. ముఖ్యంగా మహిళా పోలీసులు సమాజంలో స్త్రీల పట్ల ఏ విధంగా వ్యవహరించాలనేది ప్రజలకు తెలియజేస్తున్నారని చెప్పారు. స్థానికంగా జరిగే పండుగలు, జాతరల సందర్భంగా శాంతిభద్రతలు కాపాడటంలో స్థానికులతో కలిసి ముందుకు సాగాలని సూచించారు. సంవత్సర కాలంలో గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదులు, నేరస్తులనుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తులు, నగదు వివరాలు తదితర వాటిని ఆయన అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్లు రోజుకో పద్ధతిలో చేసే దోపిడీ విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

## 'ఎస్కీ'లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కోల్‌కతా బృందం



**రాయదుర్గం:** 'ఎస్కీ' క్యాంపస్‌ను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కోల్‌కతా అధికారులు బుధవారం సందర్శించారు. 'ఎస్కీ' డైరెక్టర్ రామేశ్వరరావుతో సమావేశమయ్యారు. అనంతరం క్యాంపస్‌లోని ఎస్‌పీజీఎస్ కళాశాల ఏర్పాటు, నిర్వహించే కోర్సులు, ఎస్కీలో ఏడాది పొడవునా నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం కాలేజీ ప్రాంగణంలో 3 నెలల్లో నిర్మించిన సెంచరీ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు అంతర్జాతీయ సమావేశాలు జరిగాయని డైరెక్టర్ రామేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చీఫ్ లక్ష్మీకాంతారావు, అమర్‌నాథ్, రాజారావు, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్కీ, ఎస్‌పీజీఎస్ కళాశాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# వరద కాలువలు మాయం!



పోశెట్టిగూడ శివారులో వరద కాలువపై పైపులు వేసి చేపడుతున్న నిర్మాణాలు



వరద కాలువను మట్టితో పూడ్చుతున్న దృశ్యం

- కబ్జా కోరల్లో గొలుసుకట్టు చెరువులు
- కాలువలను పూడ్చివేస్తున్న కబ్జాదారులు
- చదును చేసి ప్లాట్లు వేస్తున్న వైనం
- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

**శంషాబాద్ రూరల్:** నీటి వనరుల సంరక్షణకు ఓ వైపు ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా.. మరో వైపు అక్రమార్కులు వరద కాలువలను ధ్వంసం చేస్తున్నారు. అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా వరద కాలువలు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న గొలుసు కట్టు చెరువుల వరద కాలువలు కబ్జా కోరల్లో చిక్కుకుపోతున్నాయి. పట్టా భూముల్లోంచి వెళ్తున్న వరద కాలువను ఇష్టారాజ్యంగా పూడ్చి చదును చేస్తున్నారు. దీంతో వరద నీరు వెళ్లేందుకు మార్గం లేక వరద దారి మళ్లీ పంట పొలాలను ముంచెత్తుతుంది.

◆ పోశెట్టిగూడ శివారులో దారి పక్కన కల్వర్టు వద్ద వరద కాలువ కబ్జా కారణంగా కుంచించుకుపోయింది.

◆ హమీదుల్లానగర్ చెరువు నుంచి తొండుపల్లి చెరువులోకి వరద వెళ్లే ఈ కాలువ చాలా చోట్ల ఇప్పటికే ధ్వంసమైంది. దారిపై ఉన్న కల్వర్టు పక్కన నిబంధనలకు విరుద్ధంగా పైపులు ఏర్పాటు చేస్తున్నారు. సాగునీటి శాఖ నుంచి అనుమతులు లేకుండా పనులు చేపడుతున్నారు. పట్టా భూమి చుట్టూ ప్రహరీ నిర్మిస్తూ పనిలోపనిగా వరద కాలువను సైతం కుదించి వేస్తుండటంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**కనుమరుగవుతున్న కాలువలు...**

మండల పరిధిలో చాలా చోట్ల వరద కాలువలు కనుమరుగవుతున్నా అధికారులకు పట్టింపులేకుండా పోతోంది. ముఖ్యంగా నిజాం హయాంలో ఏర్పాటు చేసిన ఫిరంగి కాలువ దాదాపు కబ్జా కోరల్లో చిక్కుకుంది. రియల్టర్లు కొన్ని చోట్ల కాలువను కబ్జా చేసి చదును చేశారు. మరికొన్ని చోట్ల కాలువను పూడ్చి రోడ్లు వేసుకున్నారు.

◆ రామంజాపూర్ పరిధిలో కాలువను ఆక్రమించి ఇరువైపులా భారీగా కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టారు. రెండేళ్ల కిందట చేపట్టిన ఈ నిర్మాణాలను సాగునీటి శాఖ అధికారులు పూర్తి సహకారం అందించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇష్టారాజ్యంగా ఎన్‌ఓసీలు జారీ చేయడంతో రియల్టర్లు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో కాలువల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నర్కూడ శివారులో సైతం వరద కాలువను పూడ్చి చదును చేశారు.

**కుంటల్లో అక్రమ నిర్మాణాలు...**

చెరువు, కుంటల్లో సైతం అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల నర్కూడ శివారులోని మంగరాశి కుంటల్లో వెలసిన అక్రమ నిర్మాణాలు వెలుగులోకి రావడం గమనార్హం. అక్రమాలను ఆదిలోనే అడ్డుకోవాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.